అడ్డదిడ్డంగా పైప్‌లైన్లు

- పలుచోట్ల డ్రెయినేజీలకు అడ్డంగా నిర్మాణం
- వరద ప్రవాహానికి ఆటంకం
- వర్షాకాలంలో ఇళ్లలోకి చేరుతున్న మురుగు


రెండో జోన్ యూపీఎస్ ఎదుట కాలువకు అడ్డంగా వాటర్ సప్లై పైపు

మందమర్రిరూరల్: మందమర్రిలోని పలు కాలనీల్లో మురికి కాలువలకు అడ్డంగా తాగునీటి పైపులు ఉండడంతో వర్షాలు పడినప్పుడు వరద ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. నీటి ప్రవాహంలో కొట్టుకు వచ్చిన చెత్త పైపుల వద్దనే ఆగడంతో నీరు రోడ్డుపై చేరుతోంది. పలుసార్లు ఆ నీరు ఇళ్లల్లోకి చేరి ఇంట్లో సామగ్రి తడిసిన సంఘటనలు అనేకం. ఇప్పటికైనా అధికారులు మేల్కొని కాలువకు అడ్డంగా ఉన్నటువంటి పైపులను సరిచేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ ఏఈ అచ్యుత్ ను వివరణ కోరగా పలు కాలనీల్లో మురికి కాలువలకు అడ్డంగా తాగునీటి పైపులైన్ ఉందనే విషయం తన దృష్టికి వచ్చిందని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఇళ్లల్లోకి మురికి నీరు చేరుతోంది..



రెండోజోన్‌లోని అప్పర్ ప్రైమరీ స్కూల్ ఎదుట ఉన్నటువంటి మురికి నీటి కాలువకు అడ్డంగా పైపులైన్ ఉండడం వల్ల వర్షం పడిందంటే చెత్త పేరుకుపోయి మురికి నీరు రోడ్డుపై నుంచి పారుతుంది. రోడ్డు కింది స్థాయిలో ఇళ్లు, క్వార్టర్లు ఉండడంతో ఇళ్లల్లోకి మురికినీరు చేరి సామగ్రి తడిసిపోతుంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

అందుర్తి సంపత్, స్థానికుడు

రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి(తాండూర్): వరిధాన్యం కొనుగోలు చేయడానికి రైతులను ఏలాంటి ఇబ్బందులకు గురి చేయొద్దని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. తాండూర్ మండలం కాసిపేటలో బుధవారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. తూకం వేసి పది రోజులు గడుస్తున్నా, ధాన్యం రవాణా చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు ఎమ్మెల్యేకు గోడు వెళ్ల బోసుకున్నారు. రైతుల బాధను కలెక్టర్ బదావత్ సంతోష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు, రవాణా విషయంలో మీనమేషాలు లెక్కించొద్దని అధికారులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రవాణా చేయించడానికి సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం అకాల వర్షాలు కురుస్తుండటంతో కళ్లంలో ధాన్యం ఉండి రైతులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు వాహనాల సమస్యలు ఉత్పన్నమైతే సింగరేణి యాజమాన్యం సహకారంతో వాహనాలను సర్దుబాటు చేయడానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే రైతులకు భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేవెంట జెడ్పీటీసీ బానయ్య, రైతులు, ప్రజలు ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బెల్లంపల్లిరూరల్: రైతు, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మండలంలోని మాలగురిజాల గ్రామంలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పీఎం ఏజేఏవై మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో లబ్ధిదారులకు మంజూరైన బోర్‌వెల్ పనులను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమన్నారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, ప్రతిఒక్కరి అభ్యున్నతికి కృషి చేస్తోందని సూచించారు. బీఆర్ఎస్ పార్టీని ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అశోక్ కుమార్, ఎంపీటీసీ శకుంతల, ఉప సర్పంచ్ రాజేశ్వరి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన


మాట్లాడుతున్న సీడీపీవో మనోరమ

భీమారం: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెన్నూర్ ఐసీడీఎస్ సీడీపీఓ మనోరమ అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని దాంపూర్ గ్రామంలో బుధవారం వర్షపు నీటిపై, ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షపు, వృథా నీటిని ఇంకుడుగుంతల ద్వారా ఒడిసిపట్టాలని, దీని భూగర్భ జలాలు మెరుగవుతాయన్నారు. ప్రజలు నీటిని కాపాడేందుకు పాటు పడాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని సూచించారు. విచ్చలవిడిగా అడవుల నరికివేత కారణంగా వాతావరణంలో కీలక మార్పులు సంభవిస్తున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, సూపర్‌వైజర్ రజితతో పాటు వైద్యసిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుపై అవగాహన

వ్యవసాయ సమాచారం


రైతులతో మాట్లాడుతున్న ఏఈవో వైష్ణవి

కోటపల్లి: మండలంలోని బొప్పారం గ్రామంలో ప్రధాన పంటలు వేసే ముందు పచ్చిరొట్ట ఎరువుల సాగు చేయడంపై బుధవారం ఏఈవో వైష్ణవి రైతులకు అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట సాగు చేయడం వల్ల భూమిలో కర్బనము నత్రజని అందటం వల్ల రసాయన ఎరువుల వాడకం తగ్గించి భూములు సారవంతం చేసుకోవచ్చని వివరించారు. ఖచ్చితంగా రైతులు అధీకృత డీలర్ల వద్దే విత్తనాలు తీసుకోవాలని, పంట పూర్తయ్యే వరకు బిల్లులు తమవద్దే ఉంచుకోవాలని సూచించారు. అనంతరం వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జెల్ల సతీశ్, రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తనాలు

లక్సెట్టిపేట: మండలంలోని జెండా వెంకటాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సబ్సిడీపై జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు ఏవో ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వానాకాలం సీజన్‌కుగాను పచ్చిరొట్ట విత్తనాలు అయిన జీలుగ విత్తనాల 30కేజీల బ్యాగ్ ధర రూ.843, జనుము విత్తనాల 40కేజీల బ్యాగ్ రూ.1225 ధర ఉందన్నారు. జీలుగ విత్తన బ్యాగ్‌లను రెండున్నర ఎకరాలకు ఒక బ్యాగ్ చొప్పున సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పెసర, మినుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టా పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను తీసుకొని రావాలని పేర్కొన్నారు.

రక్షణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలి

- జీఎం సంజీవరెడ్డి


గనిలోకి దిగుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: ఆర్కే–7 గనిని గురువారం శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి సందర్శించారు. గ్రూప్ ఏజెంట్ మాలోత్ రాముడు, గని మేజర్ మేనేజర్ సాయిప్రసాద్‌తో కలిసి గని భూగర్భంలో దిగి పనిస్థలాలను పరిశీలించారు. గనిలో అధికారులు చేస్తున్న రక్షణ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఉద్యోగులతో మాట్లాడుతూ..రక్షణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలని, రక్షణ సూత్రాలు పాటిస్తూ పనిచేస్తే ప్రమాదాలకు దూరంగా ఉంటారన్నారు. ప్రమాద రహిత గనిగా తీర్చిదిద్దడానికి ఉద్యోగులు, అధికారులు కలిసి పని చేయాలన్నారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి రవిశంకర్, గ్రూప్ ఇంజనీర్ రాజా రవిచరణ్, అండర్ మేనేజర్ వెంకట్‌రామ్, ఇంజనీర్ సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

గనులపై సంబురాలు


కేకే–1 గనిపై మాట్లాడుతున్న సత్యనారాయణ

మందమర్రిరూరల్: బొగ్గుగని కార్మికుల పదకొండో వేజ్‌బోర్డ్ సమావేశంలో మెరుగైన ఒప్పందం జరిగిందని ఏరియాలోని కేకే–1 గనిపై ఏఐటీయూసీ, కేకే–5 గనిపై ఐఎన్టీయూసీ నాయకులు బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వేజ్‌బోర్డ్ ఒప్పందం జరగడంతో కార్మికులకు అధనంగా అలవెన్స్‌లలో 25శాతం పెరుగుతుందని, జూన్ మాసం వేతనంతో కొత్త వేతనాలు అమల్లోకి వస్తాయన్నారు. కేకే–1గనిపై నిర్వహించిన సమావేశంలో ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సుదర్శన్, మలయ్య, ప్రభాకర్, భానయ్య, ఆంబయ్య, ఓం నారాయణ తదితరులు ఉన్నారు. కేకే–5గనిపై నిర్వహించిన సమావేశంలో ఐఎన్టీయూసీ నాయకులు ఏరియా ఉపాధ్యక్షుడు భూమయ్య, నాయకులు సమ్మయ్య, రాంబాబు, నరేందర్ తదితరులు ఉన్నారు.

ఎస్టీపీపీలో పర్యావరణంపై అవగాహన


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, కార్మికులు

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో పర్యావరణ పరిరక్షణలో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నిజామాబాద్ సూచనల మేరకు పర్యావరణంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్టీపీపీలో గల డీఎం ప్లాంట్ వద్ద ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బాధ్యతతో మొక్కలు నాటి రక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో పర్యావరణాధికారి వసుదేవామూర్తి, అధికారులు సబ్బారావు, సింగరేణి, పవర్‌మేక్ కంపెనీ అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

'సింగరేణి కాలేజీలో నాణ్యమైన విద్య'


మాట్లాడుతున్న లెక్చరర్

శ్రీరాంపూర్: ఉద్యోగుల పిల్లలకు కొత్తగూడెంలోని సింగరేణి డిగ్రీ, పీజీ ఉమెన్స్ కాలేజీలో నాణ్యమైన విద్య బోధన చేస్తున్నట్లు ఆర్కే గని మేనేజర్ సాయిప్రసాద్ తెలిపారు. గనిపై కాలేజీ లెక్చరర్లు బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అమ్మాయిల బంగారు భవిష్యత్ కోసం సింగరేణి సంస్థ అనేక రాయితీలు కల్పించి, అనేక కోర్సుల్లో విద్యాబోధన చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగుల పిల్లల కోసమే కంపెనీ ఈ కాలేజీని ఏర్పాటు చేసిందన్నారు. కావున డిగ్రీ, పీజీల్లో అడ్మిషన్లను పొందాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి రవిశంకర్, కెమిస్ట్రీ లెక్చరర్ శైలజ, ఇంగ్లీష్ లెక్చరర్ ఎండి నవీన్ బేగంతో పాటు పుష్పలత, విమల, గని సంక్షేమ అధికారి శాంతం పాల్గొన్నారు.

ఫిట్ కమిటీ సెక్రెటరీ ఎన్నిక

శ్రీరాంపూర్: సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (140/ 2018) శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్ నూతన ఫిట్ కమిటీని బుధవారం ఎన్నుకోగా ఫిట్ సెక్రెటరీగా కాద్రేవుల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఏరియా కన్వీనర్ డేగల ప్రవీణ్ కుమార్, కో కన్వీనర్ నక్క సుమన్, జాయింట్ సెక్రెటరీగా అందే వెంకటేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వేల్పుల ప్రవీణ్ నాయకులు మురళి, నర్సింగరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యూనిఫాంల పరిశీలన


కుట్టిన యూనిఫాం పరిశీలిస్తున్న డీఈవో

దండేపల్లి: పాఠశాలల ప్రారంభానికి ఒక రోజు ముందే పిల్లల యూనిఫాం కుట్టడం పూర్తిచేయాలని డీఈవో యాదయ్య అన్నారు. మండల కేంద్రంతో పాటు, మండలంలోని మేదరిపేటలో యూనిఫాం కుడుతున్న టైలర్ల వద్దకు బుధవారం వెళ్లారు. యూనిఫాంలు కుట్టడం ఎంతవరకు వచ్చిందని ఆరాతీశారు. కుట్టిన యూనిఫాంలను పరిశీలించారు. కొలతల ప్రకారం కుడుతున్నారా లేదా? అని అడిగారు. అంతే కాకుండా నాణ్యతగా కుట్టాలని సూచించారు. ఆయన వెంట సెక్టోరియల్ అధికారి చౌదరి, సీసీవో మల్లేష్, సీఆర్పీలు నర్సయ్య, సురేందర్ ఉన్నారు.

వెలుగుతున్న సెంట్రల్ లైటింగ్



సాక్షి ఎఫెక్ట్..

మందమర్రిరూరల్: కోల్ బెల్ట్ రహదారి డివైడర్ మధ్యలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వెలగకపోవడంతో ఈ నెల 14న 'సాక్షి' దినపత్రికలో 'మందమర్రిలో సెంట్రల్ లైటింగ్ ప్రారంభమెప్పుడో' అనే కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. దీంతో కోల్‌బెల్ట్ రహదారి రెండు వైపులా బుధవారం లైట్లు వెలిగేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారు. పోస్టాఫీస్ వద్ద నుంచి పాలచెట్టు ఏరియా వరకు ఎలాంటి లైట్లు లేక రాత్రి సమయంలో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. లైటింగ్ ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకంపై హర్షం

మంచిర్యాలటౌన్: స్థానిక ప్రభుత్వ మెడికల్ కాలేజీలోని 24విభాగాల్లో బోధించేందుకు గాను 49మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించినందుకు గాను మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు సీఎం కేసీఆర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 49మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకంతో మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోనూ వైద్య సేవలు మరింతగా మెరుగుపడేందుకు అవకాశం ఉన్నట్లు తెలిపారు.

నోటీస్ బోర్డ్‌పై మార్కుల జాబితా

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 7, 8, 9, 10వ తరగతుల్లో ప్రవేశం కోసం అడ్మిషన్ 23–24టెస్ట్ రాసిన విద్యార్థుల మార్కుల, ర్యాంకుల జాబితా స్కూల్‌లోని నోటీస్ బోర్డ్‌పై అంటించినట్లు స్కూల్ ప్రిన్సిపల్ జయకృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల మార్కుల, మెరిట్, రిజర్వేషన్, స్థానికత ఆధారంగా ఆయా తరగతుల్లో మిగిలిన సీట్ల ఆధారంగా అడ్మిషన్ ఉంటుందని విద్యార్థులు గమనించాలని ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రాన్ని వినియోగించుకోవాలి

జన్నారం: ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని మహిళలు వినియోగించుకోవాలని తహసీల్దార్ కిషన్ అన్నారు. మండలంలోని మహ్మదబాద్‌లో కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో కార్మిక శాఖ అధికారులు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తున్నారని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట తాపీమేస్త్రీల సంఘం అధ్యక్షుడు ముల్కల్ల ప్రభాకర్, మహిళలు ఉన్నారు.

ఓఆర్ఎస్ అందజేత



మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి వచ్చిన గర్భిణులు, బాలింతలకు బుధవారం రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి వి.మధుసూదన్ రెడ్డి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంసీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భీష్మమ్మ, నర్సింగ్ సూపర్‌వైజర్ భారతి పాల్గొన్నారు.

ముగిసిన భీరయ్య దేవుడి ఉత్సవాలు


విరాళం అందజేస్తున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని పెద్దంపేట గ్రామ పరిధిలోని గొల్లపల్లిలో యాదవుల ఆరాధ్య దైవమైన భీరయ్య దేవుడి కొలువు ఉత్సవాలు బుధవారం నాగవెల్లి పట్నాల వేడుకలతో ముగిశాయి. పోచమ్మతల్లికి బోనాలు, భీరయ్య స్వామి ఉత్సవ మూర్తులకు గంగస్నానం, ప్రతిష్ఠ, ప్రత్యేక పూజలు నిర్వహించడం, సుంకుబియ్యం పట్టడం, భీరయ్య దేవుడికి బోనాల సమర్పణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీరయ్యస్వామి కల్యాణ మహోత్సవం అనంతరం చివరిరోజు నిర్వహించిన నాగవెల్లి పట్నాల వేడుకను భక్తులు కనులపండవగా తిలకించారు. మంచిర్యాల డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు దంపతుల చేతుల మీదుగా అన్నసంతార్పన ఏర్పాటు చేయగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ అభివృద్ధికి సురేఖ–ప్రేమ్‌సాగర్‌రావు రూ.30వేల నగదు విరాళం అందజేశారు.

ఆధ్యాత్మికం

భక్తిశ్రద్ధలతో నాగవెల్లి పట్నం

బెల్లంపల్లి(తాండూర్): తాండూర్ మండలం ద్వారకాపూర్‌లో బుధవారం బీరప్పా, కామవతిల నాగవెల్లి పట్నం కార్యక్రమాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే చిన్నయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలను సల్లంగా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో తాండూర్ మండల ఎంపీపీ పూసాల ప్రణయ్‌కుమార్, జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, సర్పంచ్‌లు, ఇతర ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొబ్బరికాయ, పూజా సామగ్రి కోసం వేలం

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథస్వామి దేవస్థానంలో కొబ్బరికాయలు, పూజా సామగ్రి అమ్ముకొనేందుకు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునే హక్కు పొందేందుకు జూన్ 1న వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ముక్తారవి తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.50వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రక్తదానం చేసి.. అభిమానాన్ని చాటి



దండేపల్లి: మండలంలోని కొత్తమామిడిపల్లికి చెందిన ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు నలిమెల వినయ్ వారం క్రితం గడ్డిమందు తాగి బలవన్మరణం చెందాడు. దీంతో అతడి స్నేహితులు కొత్తమామిడిపల్లిలో బుధవారం సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ జ్ఞాపకార్థం మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి, సుమారు 40మంది యువకులు రక్తదానం చేసి, వినయ్‌పై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. తమతో కలివిడిగా ఉన్న వినయ్, ప్రేమ కారణంగా బలవన్మరణం పొందడం బాధగా ఉందని పలువురు విచారం వ్యక్తం చేశారు.

'ధాన్యం కొనుగోళ్లలో జాప్యం లేకుండా చూడాలి'


ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి వినోద్

బెల్లంపల్లిరూరల్: వరిధాన్యం కొనుగోలులో జాప్యం లేకుండా, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ప్రభుత్వం చూడాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గడ్డం వినోద్ అన్నారు. బెల్లంపల్లి మండలం పాతబెల్లంపల్లి, ఆకెనపల్లి, బుచ్చయ్యపల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు, లారీల కొరత లేకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. రోజుల పాటు కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు పడిగాపులు కాస్తున్నా, అధికార యంత్రాంగం పట్టింపు లేకుండా వ్యవహరిస్తే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. రైతులు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలువురు మహిళలు తమ సమస్యలను విన్నవించగా వాటిని పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కారుకూరి రాంచందర్, చంద్రవెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చింతం స్వామి, సర్పంచ్ రాజలింగు, ఉప సర్పంచ్ రాజ్‌కుమార్, నాయకులు మహేశ్వర్, ఓదెలు, భూమయ్య, చిన్న మల్లయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన


పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న గోవర్ధన్

దండేపల్లి: గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ పునర్నిర్మాణం పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదని, జలసాధన సమితి నాయకుడు నైనాల గోవర్ధన్ ఆరోపించాడు. పైప్‌లైన్ నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12కిలోమీటర్ల పాత జీఆర్పీ పైప్‌లైన్‌లో నాలుగు కిలోమీటర్లు తొలగించి, దాని స్థానంలో చేపడుతున్న ఎమ్మెఎస్ పైప్‌లైన్ నిర్మాణంలో పాత పైపులు వాడటం, పైగా నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం బాగోలేదన్నారు. గతంలో చేపట్టిన పైప్‌లైన్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు లోపించడంతోనే తరచూ లీకేజీలు ఏర్పడ్డాయన్నారు. పైప్‌లైన్ పునర్నిర్మాణాన్ని నాలుగు కిలోమీటర్లు కాకుండా పూర్తిగా చేపట్టాలన్నారు. అలాగే సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీల్లో భాగంగా కుప్టి ప్రాజెక్టును నిర్మించడంతో పాటు, కడెం ప్రాజెక్టు ఎత్తును పెంచి, సాగునీటి ఇబ్బంది తొలగించాలన్నారు. ఆయన వెంట జలసాధన సమితి నాయకులు తిరుపతి, బుచ్చిరెడ్డి, రాజలింగం తదితరులు ఉన్నారు.

వీఓఏల నిరసన


నినాదాలు చేస్తున్న వీఓఏలు

దండేపల్లి: మండలంలో వీఓఏల దీక్ష శిబిరాన్ని వీఓఏల సంఘం (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు రంజిత్ సందర్శించారు. వీఓఏలపై ప్రభుత్వం కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతోందని, న్యాయమైన సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. రెండు రోజుల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల కలెక్టరేట్‌లను ముట్టడిస్తే వీవోఏలను అరెస్ట్ చేయడం శోచనీయం అన్నారు. వీవోఏల అక్రమ అరెస్టులను ఖండించారు.వెంటనే విడిచి పెట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు.